క్లుప్తంగా

నేడు రామాలయంలో విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలు

నాతవరం : మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. రెండు రోజులుగా రామాలయం ప్రాంగణంలో కాకినాడకు చెందన వేదపండితులతో ప్రత్యేక హోమాలు, పూజలు జరిపారు. మొదటి రోజున సీతారాముల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. సీతారాముల విగ్రహ ప్రతిష్ట అనంతరం రామాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు

చీడికాడ : మండలంలో మంచాల మోడల్ స్కూల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.వెంకటలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే విద్యార్థులు 5వ తరగతి పూర్తి చేసి ఉండాలని, ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓసి, బీసీ అభ్యర్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.75 పరీక్ష రుసుం చెల్లించి ఏప్రిల్ 20వ తేదిన జరిగే పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. 6 తరగతి అడ్మిషన్ మెరిట్, రోస్టర్ ఆధారంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సిఎస్‌సి.ఎపి.జిఓవి.ఇన్, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎపిఎంఎస్.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కోసం పాఠశాలలో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా కవలల దినోత్సవం



కవల విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పలకొండ

కె.కోటపాడు: కవలల దినోత్సవాన్ని చౌడువాడలోని శ్రీసాయి విద్యావిహార్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న కవలలు చోరీగల రామ్‌చరణ్, లక్ష్మణ చరణ్‌లను, రాపేటి అంకిత్, లలితాంజలిలను, బోర రాము, లక్ష్మణలకు పాఠశాల ప్రిన్సిపాల్ దీవి అప్పలకొండ (దత్తు) బహుమతులు అందించారు. కవలల రూపురేఖలు, హావభావాలు అందరికీ ఆసక్తికరంగా ఉంటాయన్నారు. వారు అన్ని రంగాల్లో మేటిగా నిలవాలని ఆకాంక్షించారు.

మార్చి 19 వరకు బ్రూసెల్లా టీకాలు

చీడికాడ : మాడుగుల ఏరియా పశువైద్యశాల పరిధిలో గల చీడికాడ, మాడుగుల, మండలాల్లో బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం జరుగుతుందని పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. ఖండివరంలో నిర్వహిస్తున్న బ్రూసెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. మండలంలో అన్ని గ్రామాల్లో బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం వచ్చే నెల 19వ తేదీ వరకు జరుగుతుందని, పాడి రైతులు తమ వద్ద గల ఆడపెయ్యిలకు ఈ టీకాలు తప్పకుండా వేయించాలని సూచించారు.కార్యక్రమంలో ఖండివరం పశువైద్యాధికారి గణేశ్, పశువైద్య సహాయకులు సంతోష్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



సాంస్కృతిక కార్యక్రమంతో అలరించిన విద్యార్థులు

కె.కోటపాడు : గురువుల మాటకు విలువ ఇస్తూ విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం కిండర్ గార్డెన్ విద్యార్థుకు గ్రాడ్యుయేషన్ డే, టెన్త్, ఇంటర్, డిగ్రీ, కళాశాల విద్యార్థుకు ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. మాజీ వీసీ ముత్యాలనాయుడు, అయ్యన్న విద్యాసంస్థల వ్యవస్థాపకుడు అయ్యన్న సాహెబ్‌తో కలిసి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం ఆధ్వర్యంలో 50 మంది యు.కె.జి విద్యార్థులకు ముత్యాలునాయుడుతో పాటు అప్సా జోన్-1 అధ్యక్షుడు ఎం.వి.రావు పట్టాలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గుండెకు భరోసా..



ఏరియా ఆసుపత్రిలో స్టెమీ వార్డు



- ఏరియా ఆస్పత్రిలో స్టెమీ సేవలు
- ఉచితంగా రూ.45 వేలు విలువ గల ఇంజెక్షన్

కోటవురట్ల మండలం, గొట్టివాడకు చెందిన కె.వెంకునాయుడుకు ఈ నెల 17న గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది అతనని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు వెనువెంటనే అతనికి ఈసీజీ తీశారు. గుండెపోటు లక్షణాలు ఉండడంతో స్టెమీ వార్డులో చేర్పించి వెంటనే టెనెక్టిప్లస్ ఇంజెక్షన్ ఇచ్చారు. కోలుకున్న తరువాత మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు పంపారు. మెరుగైన వైద్య సేవలు అందించడంతో ప్రస్తుతం కోలుకుంటున్నారు.

నర్సీపట్నం : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి మైదాన, ఏజెన్సీ మండలాలకు పెద్దదిక్కుగా ఉంది. ఎలాంటి కష్టం వచ్చినా పేద ప్రజలు ఏరియా ఆసుపత్రిని ఆశ్రయిస్తారు. గతంలో గుండె నొప్పితో వచ్చిన రోగులను విశాఖ కేజీహెచ్‌కు పంపేవారు. ఏడాది క్రితం గుండెపోటుకు ప్రాథమిక చికిత్సను అందుబాటులోకి తీసుకువచ్చారు. గుండెపోటు వచ్చిన వారు ప్రాంతీయ ఆసుపత్రికి వెళితే వారి గుండె లయ తప్పకుండా రూ.45 వేలు విలువ చేసే టెనెక్టిప్లస్ అనే ఇంజెక్షన్ ఇచ్చి ప్రాణాలు పోస్తున్నారు. ఒత్తిడి, ఆహార అలవాట్లు, వ్యాయామం చేయకపోవడం. ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా గుండెపోటు వచ్చి పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. గుండెపోటు మరణాలు అధికమవుతుండడంతో వాటిని నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. తక్షణ వైద్యం అందించేందుకు ఏరియా ఆస్పత్రిలో స్టెమి పేరిట సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

తొలి గంట ఎంతో ముఖ్యం

గుండెపోటుకు గురైన వారికి తొలి గంట ఎంతో ముఖ్యం. ఈ సమయంలో ప్రాథమిక చికిత్స అందించడం వల్ల ప్రాణాలతో బయటపడవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. గతంలో గుండెపోటు వచ్చిన వారు విశాఖ వెళ్లే లోపు ప్రాణాలు కోల్పోయేవారు.ఈ నేపథ్యంలో వైద్యశాఖ స్టెమి యాప్‌ను తీసుకువచ్చింది. ప్రాంతీయ ఆస్పత్రిలో ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు 34 మంది ప్రాణాలను కాపాడగలిగారు.



స్టెమీ సేవల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

స్టెమీ వార్డులో 24 గంటల వైద్య సేవలు



గుండెపోటుకు అత్యవసర విభాగం ఏరియా ఆస్పత్రిలో ఉంది. సేవలను ప్రజలు వినియోగించుకోవాలి. కంగారుపడి ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన అవసరం లేదు. చాతిలో నొప్పి వచ్చిన వెంటనే ఆస్పత్రికి తీసుకువచ్చినట్టయితే ప్రాణాలను కాపాడవచ్చు. ఇటీవల స్టెమీ వార్డును అందుబాటులోకి తీసుకువచ్చాం. స్టెమీ వార్డులో 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నాం.

– సుధాశారద, సూపరింటెంటెంట్, నర్సీపట్నం

లక్షణాలు కన్పిస్తే వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి



గుండెపోటుకు ఏరియా ఆసుపత్రిలో అత్యవసర విభాగం అందుబాటులో ఉంది. గుండెపోటు వచ్చిన ఆరు గంటల లోపు ఇంజెక్షన్ ఇస్తేనే ప్రయోజనం. గుండెదడ, ఎడమవైపు భుజం లాగడం, ఛాతిలో నొప్పి, ఉన్నట్టుండి ఆయాసం పెరగడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలి. గుండె వైద్యనిపుణుల సూచనల మేరకు టెనెక్టిప్లస్ ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తాం.

–డాక్టర్ లత, జనరల్ మెడిసిన్ వైద్యులు

మెగా డీఎస్సీలో ఎస్‌ఎస్‌ఏలకు న్యాయం చేయాలి

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం మెగా డీఎస్సీలో సర్వ శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆయా ఉద్యోగులు కోరారు. శనివారం బుచ్చెయ్యపేట మండలంలోని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావును కలిసి వినతి పత్రం అందించారు. గత 13 సంవత్సరాలుగా సమగ్ర శిక్షలో అవుట్ సోర్స్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పలు విభాగాల్లో పని చేస్తున్నామన్నారు. ఐఆర్టీ, డీటీఓ, సీఆర్ఎంటీఎస్, ఎంఐఎస్, అకౌంటెంట్, పీటీఐ, మెసెంజర్స్‌గా విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు జీతాల పెరుగుదల లేకపోగా హెచ్ఆర్పీ పాలసీ గాని, ఎంటీఎస్ గానీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఎస్టీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అన్ని అర్హతలు కలిగి ఉన్నామని, 2024 మెగా డీఎస్సీలో అదనంగా 10 మార్కులు కలిపి న్యాయం చేయాలని మండల సర్వశిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాటికొండ శ్రీను, ఉద్యోగులు ఆర్.ఎ.కుమార్, జి.శ్రీనివాసరావు ఎంఈవోకు వినతి పత్రం అందించారు.



ఎంఈవోకు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పలు గ్రామాల్లో వర్షం

రోలుగుంట : మండలంలో శనివారం సాయంత్రం పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయింత్రం వరకూ ఎండకాసి సుమారు నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఒక మోస్తరు వర్షం పడింది. సుమారు రెండు నెలలు తరువాత శనివారం వర్షం పడడంతో ఇటీవల నాటిన సరుగుడు మొక్కలతో పాటు చెరకు నాట్లు, తోటలకు కొంత మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మరో రెండు దఫాలు ఈ వారంలో ఈ మాదిరి వర్షం పడితే వేసవి దుక్కులు చేసుకోవచ్చని చెబుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం..



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను సత్కరిస్తున్న పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

నర్సీపట్నం : నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమితులైన వారు శనివారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు యల్లా సన్యాసినాయుడు, రైతు విభాగం అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణ, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు సుర్ల రమణ తదితరులు శాలువా కప్పి సత్కరించారు. గణేష్ సారథ్యంలో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేయాజ్ ఖాన్

నర్సీపట్నం : మార్చి 8న జరగనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ పిలుపునిచ్చారు. న్యాయస్థానం అవరణలో శనివారం పోలీసు, బ్యాంక్, ఫారెస్ట్, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి సమయం, ధనం వృధా చేసుకోకుండా సామరస్య వాతావరణంలో కేసులు పరిష్కరించుకోవచ్చన్న విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పరిష్కరించుకునేందుకు ముందుకు వచ్చిన వారి జాబితాను సిద్ధం చేసుకుని, లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రోహిత్, డీఎస్పీ శ్రీనివాసరావు, డీఎఫ్‌వో ఎం.శామ్యూల్, టౌన్, రూరల్ సీఐలు గోవిందరావు, రేవతమ్మ, ఎస్ఐలు పాల్గొన్నారు.

మోదమాంబ ఆలయానికి విరాళం



ఆలయంలో విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ ఆలయ అభివృద్ధికి స్థానికులు శనివారం విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన జల్లి నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు రూ. 10వేల విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు పాల్గొన్నారు.

హైబ్రిడ్ వంటకాలు అనారోగ్య కారకాలు

చోడవరం రూరల్ : హైబ్రిడ్ వంటకాలు, రసాయనాలతో కూడిన పంటలు అనారోగ్య పరిస్థితులకు దారి తీస్తున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కారణంగానే కళాశాలలో అమ్మ చేతి వంటకాలు, విద్యార్థులు స్వయంగా చేసిన ఆర్గానిక్ వంటకాలను ప్రదర్శించి, మార్కెటింగ్ స్కిల్స్, నైపుణ్యాలను పెంపు చేసుకోవడానికి వీలుగా విద్యార్థులకు ఈ అవకాశం కలిగించినట్టు తెలిపారు. ఫుడ్ ఫెస్ట్ కోఆర్డినేటర్ రత్నభారతి, సభ్యులు రాధాకృష్ణ, సూర్యవతి, బి.పిచ్చమ్మ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, పాలిటెక్నిక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేయగా అన్నింటిలోని వస్తువులు అమ్ముడుపోయాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి, వి.అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, కృష్ణారావు, మల్లిబాబు పాల్గొన్నారు.



విద్యార్థుల స్టాల్‌లో ప్రిన్సిపాల్, సిబ్బంది

తడి, పొడి చెత్త సేకరణకు సహకరించండి

దేవరాపల్లి : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణలో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్త సేకరించే క్లాప్ మిత్రలకు ప్రజలు సహకరించాలని రైవాడ పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు సూచించారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం గ్రామంలో క్లాప్‌మిత్రలతో కలిసి ఇంటింటా పర్యటించి తడి, పొడి చెత్త సేకరణతో కలిగే ప్రయోజనాలను వివరించారు. తడి, పొడి చెత్త సేకరించి సంపద కేంద్రానికి తరలించడం వల్ల అక్కడ సేంద్రియ ఎరువు తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు, పంచాయతీ పాలకవర్గం సహకారంతోనే సంపద తయారీ కేంద్రం సమర్థ నిర్వహణ సాధ్యమవుతుందన్నారు.

చీడికాడ : మన గ్రామాలను మనమే శుభ్రంగా ఉంచుకుందాం అని మండల ప్రత్యేకాధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. వీధుల్లో తిరిగి పంచాయతీ నుంచి ఇంటింటికి అందించిన చెత్త బుట్టలలో తడిచెత్త పొడి చెత్తను ఏవిధంగా వేరు చేసి ఇవ్వాలో వివరించారు. ప్రతి వారం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీడీవో హేమసుందరరావు, ఈవోఆర్‌డీ కామేశ్వరరావు పాల్గొన్నారు.



రైవాడలో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి అప్పారావు

కె.కోటపాడు : ప్రజలు తమ ఇళ్లలో చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి క్లాప్‌మిత్రలకు అందించాలని చౌడువాడ పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు అన్నారు. గ్రామంలో శనివారం ఇంటింటి చెత్త సేకరణ–ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పారిశుద్ధ్య సిబ్బంది, క్లాప్ మిత్రలతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేరేవేరుగా ఏ విధంగా చేసి ఇవ్వాలో వివరించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి చెత్త ద్వారా ఎరువు తయారు చేసి తక్కువ ధరకే రైతులకు అందించనున్నట్టు తెలిపారు. సచివాలయ సిబ్బంది తనూజ, లక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.



చౌడువాడలో తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు వివరిస్తున్న సురేష్‌బాబు

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే లక్ష్యం



శిక్షణలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు

మాకవరపాలెం: మండలంలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై రెండో విడత శిక్షణ ప్రారంభించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభించిన ఈ శిక్షణకు మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లు రాము, కరుణ, వరహాలబాబు అభ్యసనంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, సరోజిని పాల్గొన్నారు.

నాతవరం : జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో చెప్పిన ప్రతి విషయాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విధిగా అమలు చేయాలని ఎంఈవో–2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. స్థానిక హైస్కూల్లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నాలుగో రోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా రూపొందించనున్న విద్యా విధానానికి అనుగుణంగా కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పలు అంశాలపై కోఆర్డినేటర్లు కస్సూరి అర్జున, కిశోర్, దుర్గా ప్రసాద్ అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, సూర్యప్రభ, ఎంఆర్‌సీ అధికారులు శ్రీనివాస్‌నాయుడు, సీఆర్పీలు సత్యవేణి, గోవింద్ పాల్గొన్నారు.

మాడుగుల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో అంగన్‌వాడీ వర్కర్లకు గుణాత్మక విద్యపై ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ఈ నెల 25వ తేదీతో ముగుస్తాయని ఎంఈవోలు పాండురంగారావు, ఎం.దేముడమ్మ తెలిపారు. ఆట, పాటల ద్వారా ప్రీస్కూల్ విద్యాబోధనపై అందిస్తున్న ఈ శిక్షణ తరగతులు అంగన్‌వాడీ వర్కర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, రిసోర్స్‌పర్సన్ మణికాంత, కృష్ణ, రవి, సూపర్‌వైజర్‌లు నారాయణమ్మ, ఈశ్వరమ్మ, సీఆర్‌పీలు అచ్చుతరావు, హరికృష్ణ, సంధ్య, కాశీ సురేష్, శారద, ఎంఆర్‌సీ సిబ్బంది, రాజు. నాగేంద్ర పాల్గొన్నారు.

రోలుగుంట : చిన్నారులతో ప్రేమతో మెలుగుతూ అక్షర జ్ఞానం కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్లకు ఎంఈవో జగ్గారావు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుచ్చింపేట, రోలుగుంట సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమ్య, హైమ వారి సెక్టార్‌ల పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గణితం అంకెల గారడీ, అంగ్లం అక్షరమాలపై శిక్షణ ఇచ్చారు.

రేపటి నుంచి గౌరీశ్వరస్వామి కల్యాణ, శివరాత్రి మహోత్సవాలు

చోడవరం : చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామివారి వార్షిక కల్యాణ, మహాశివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 24 నుంచి ప్రారంభమై మే 1వ తేదీ వరకు స్వామివారి వార్షిక కల్యాణ, శివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కరపత్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే ఆలయాన్ని మరింత ప్రాచుర్యం పొందే విధంగా అభివృద్ధి చేస్తున్నామని, పుష్కరిణి పనులు కూడా వేగంగా పూర్తి అయ్యేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఈవో సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు, ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్సవాల ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా

నాతవరం : రికార్డులు లేకుండా, హెల్మెట్ ధరించకుండా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని నర్సీపట్నం– తుని అర్‌అండ్‌బీ రోడ్డులో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు.



వాహనతనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ భీమరాజు

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చేయాలి

నాతవరం : ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే ధ్యేయంగా పని చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.నాగశిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని 31 గ్రామ పంచాయతీలో బోర్లు, తాగునీటి పథకాలకు మరమ్మతులు లేకుండా ముందుగా బాగు చేయాలన్నారు. మార్చి నాటికి మండల వ్యాప్తంగా జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులు శత శాతం పూర్తి చేయాలన్నారు. అంతకుముందు పీజీఆర్ఎస్ దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించి భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ భీమరాజు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం

మాడుగుల రూరల్ : వర్మీకంపోస్టును తయారు చేసి, దానిని విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా పంచాయతీరాజ్ ఈఈ, మండల ప్రత్యేకాధికారి కె.వి.నాయుడు అన్నారు. కె.జె.పురంలోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సహాయకులు, క్లాప్ మిత్రలకు శిక్షణ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈవోపీఆర్‌డీ సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొర, సర్పంచ్ రమణబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం కూడా నిర్వహించారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాయుడు

దీర్ఘకాల వ్యాధులకు క్రమం తప్పక మందులు వాడాలి

నర్సీపట్నం : ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో ఏఆర్‌టీ సెంటర్‌లో కోఆర్డినేషన్, ఫెసిలిటేషన్ ఆఫ్.పి.ఎల్.హెచ్.ఐ.వి నెట్‌వర్క్ మీటింగ్ నిర్వహించారు. ఏఆర్‌టీ సెంటర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులకు వ్యాధి సంబంధ అపరేషన్ చేయుటకు కొంత వరకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి ఇబ్బందులు పడకుండా నెట్‌వర్క్ ప్రెసిడెంట్ దృష్టి సారించాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రోగుల ప్రాణాలు నిలుపుకోవచ్చన్నారు. అనంతరం నెట్‌వర్క్ ప్రెసిడెంట్ కనకరాజు మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ గోవిందరావు, జోనల్ సూపర్‌వైజర్లు రమణ, చంద్రశేఖర్, సిఎల్‌డబ్ల్యులు విహాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలి

మాకవరపాలెం : రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాల నడపరాదని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. అవంతి కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం, మాదక ద్రవ్యాలు సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు తప్పవని హెచ్చరించారు. రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదర్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి హరికిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అన్నదానం మహాదానం

అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ

మాడుగుల రూరల్ : అన్నిదానాల కన్న అన్నదానం మహాదానం అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత నిత్యాన్నదాన సత్రంను ఆయన శనివారం సందర్శించారు. అక్కడ భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు, సహకరిస్తున్న దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో భీశెట్టి రాజు పాల్గొన్నారు.



కె.జె.పురం జంక్షన్‌లో నిత్యాన్నదాన సత్రం వద్ద భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ధర్మశ్రీ